# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో నౌకా నిర్మాణంతో పాటు పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **'జల్ జీవన్ మిషన్' పనుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులే భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ భాగస్వామ్య సదస్సు లక్ష్యమని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

4. **నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.**

5. **ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు.**

===========================

సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో నౌకా నిర్మాణంతో పాటు పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి గత సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. అనంతరం భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్ కళ్యాణితో గత రాత్రి సమావేశమైయ్యారు. నౌకా నిర్మాణంతో పాటు ఎలక్ట్రానిక్స్ రంగంలో నూతన ఉత్పత్తుల తయారీకి సంబంధించి పెట్టుబడులకు ఉన్న అవకాశాలను గురించి అమిత్ కల్యాణికి చంద్రబాబు నాయుడు వివరించారు. అలాగే వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకూ విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో హెూటళ్ల నిర్మాణాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో 'జల్ జీవన్ మిషన్' పనుల పర్యవేక్షణకు జిల్లాలవారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ పనుల పురోగతిపై మంగళగిరి క్యాంపు కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతిరోజు పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించడం,

పనులకు ఏమైనా అడ్డంకులు ఉంటే జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకునేలా ఈ పర్యవేక్షణ బృందాలు పని చేయాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన జలాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఐదు జిల్లాల పరిధిలో 7 వేల 910 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జల్ జీవన్ ప్రాజెక్టులు 2027 నాటికి పూర్తి చేయాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులే భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ భాగస్వామ్య సదస్సు లక్ష్యమని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సుపై ఢిల్లీలో గత రాత్రి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనే ఏకైక అజెండాగా పనిచేస్తున్నామన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల వల్ల పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని గత 16 నెలల్లో రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రవాణాశాఖపై నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో 3 తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరిమితికి మించి అధిక బరువు ఉన్న వాహనాలు సీజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీ,ఎస్టీ నిరుద్యోగ యువతకు యూపీఎస్సీ సివిల్స్ కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలోని డా.బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈరోజు నుంచి ఈనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మరిన్ని వివరాలకు apstudycircle. apcfss.in వెబ్ సైట్ ని సంప్రదించాలని మంత్రి వివరించారు.

---------------------------

ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో నూతనంగా నిర్మించనున్న గృహ నిర్మాణాలకు మంత్రి నిన్న భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 2029 నాటికి ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేసిందన్నారు. ధర్మవరం పట్టణంలో 12 వేల గృహాలకు ఆమోదం లభించగా 5 వేల గృహాలకు పైగా నిర్మాణాలు పూర్తయ్యాయని తెలుపుతూ...

వాయిస్ 29 సెకన్లు

---------------------------

తెలంగాణలో ఆనకట్టలను నూతన సాంకేతిక విధానంలో పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆనకట్టల పునరుద్ధరణ సహా నీటిపారుదలశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలను శాస్త్రీయ, సాంకేతిక విధానంలో సరిచేయనున్నామని చెప్పారు. ఇందుకు కేంద్ర విద్యుత్, నీటి పరిశోధన కేంద్రం – సీడబ్ల్యూపీఆర్ఎస్ అవసరమైన పరీక్షలు చేస్తోందని, వరద ఉద్ధృతి తగ్గిన వెంటనే జియోఫిజికల్, హైడ్రాలిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ప్రపంచ స్థాయి పెట్టుబడులతో పాటు గ్రామ స్థాయిలో పెట్టుబడుల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఇరవై సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్రప్రదేశ్ సాధనకు పెట్టుబడుల ఆకర్షణే కీలకమని అన్నారు. పెద్ద పరిశ్రమలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని లంకా దినకర్ పేర్కొంటూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

తెలుగు సాహిత్యంలో వచన కవిత్వానికి పెట్టింది పేరైన పురిపండా అప్పలస్వామి జయంతి ఈరోజు. ఆయన బహుభాషావేత్తగా, జాతీయ వాదిగా, రచయితగా, పాత్రికేయునిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు. అప్పలస్వామి ఆంధ్రప్రదేశ్‌లోని అవిభాజ్య విజయనగరం జిల్లా సాలూరులో 1904 నవంబర్ 13న జన్మించారు. తెలుగుతో పాటు సంస్కృతం, ఒడియా, హిందీ, బెంగాలీ, ఆంగ్ల భాషల్లో పాండిత్యాన్ని సముపార్జించారు. మహాత్మాగాంధీ నిర్వహించిన సహాయ నిరాకరణోద్యమం, హరిజనోద్యమం, ఖాదీ ప్రచారాల్లో పాల్గొన్నారు. పత్రికా రంగంలో తన ప్రతిభను ప్రదర్శించారు. వీరు ప్రచురించిన 'వైశాఖి' మాసపత్రిక సారస్వత ప్రియుల మన్ననలను సంపాదించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల వరకు నమోదవుతున్నాయని తెలిపింది. పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ముంచంగిపుట్టులో అత్యల్పంగా 14.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

తెలంగాణాలోనూ రానున్న మూడు, నాలుగు రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపింది.

=====================